# ప్రగతి రథానికి ఇంధనం శ్రామిక శక్తి మాత్రమే..!

**(28 ఏప్రిల్ 'ప్రపంచ విధి నిర్వహణలో భద్రత, ఆరోగ్య దినం'తో పాటు 'అంతర్జాతీయ కార్మికుల స్మారక దినం' సందర్భంగా)**

ఐక్యరాసమితికి చెందిన 'ప్రపంచ కార్మిక సంస్థ' సౌజన్యంతో ప్రతి ఏటా 28 ఏప్రిల్ రోజున 'ప్రపంచ విధి నిర్వహణలో భద్రత మరియు ఆరోగ్య దినం'తో పాటు 'అంతర్జాతీయ కార్మికుల స్మారక దినం' జరుపు కోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ రోజున కార్య క్షేత్ర సమస్యలు, అనారోగ్య కారకాలు, ఎదురయ్యే ప్రమాదాలు, నివారణ మార్గాలు, ప్రాణ రక్షణ శిక్షణలు, ఆత్మ రక్షణ చర్యలు, గాయాలకు సత్వర చికిత్సలు, విధుల్లో ప్రాణాలర్పించిన శ్రామికుల స్మారకార్థ కార్యక్రమాలు లాంటి పలు అంశాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగేలా కార్యక్రమాలు చేపడతారు. 2003 నుంచి ఇలాంటి అత్యవసర కార్యక్రమాలను 'ప్రపంచ కార్మిక సంస్థ (వరల్డ్ లేబర్ ఆర్గనైజేషన్, ఐయల్ఓ)' ప్రతి ఏటా చేపడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి రోజు 6,300 మంది శ్రామికులు విధులు నిర్వహిస్తూ ప్రమాదంలో లేదా తీవ్ర వ్యాధులతో మరణిస్తుండగా, ఏడాదికి 2.3 మిలియన్ల ప్రాణాలొదులుతున్నారు. ఏడాదికి దాదాపు 317 మిలియన్ల ప్రమాదాలు నమోదు అవుతున్నాయి. క్షేత్ర సంబంధ ప్రమాదాలు, వ్యాధులను తగ్గించే సదుద్దేశంతో పలు దేశాలు అవసర చర్యలు చేపట్టాలని 2017లో ప్రపంచ కార్మిక సంస్థ విజ్ఞప్తి చేసింది. 2030 నాటికి ప్రపంచ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు–17 సఫలం కావడానికి పేదరిక నిర్మూలన, భూగ్రహాన్ని కాపాడుకోవడం, ఆర్థిక ప్రగతి సాధనలకు చర్యలు చేపట్టాలి. 28 ఏప్రిల్ రోజున 'అంతర్జాతీయ కార్మికుల స్మారక దినం' కూడా జరుపుకోవడం పరిపాటిగా వస్తున్నది. 01 మే రోజున "కార్మిక దినం" జరుపుకోవడానికి కూడా ఏర్పాట్లు జరుగుతున్న సందర్భమిది.

కార్మికుల ఆరోగ్య భద్రత యాజమాన్యాలదే:

కోవిడ్ మహమ్మారి ప్రభంజనానికి ప్రభుత్వాలు, ఉద్యోగులు, శ్రామికులు, సాధారణ ప్రజానీకం అనేక సవాళ్ళను ఎదుర్కోవడంతో పాటు కార్యక్షేత్రంలో అసాధారణ అనారోగ్య పరిస్థితులను అనుభవించారు. వైరస్ సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉద్యోగ శ్రామిక వర్గాల ఆరోగ్య పరిరక్షణ, భద్రతలకు సంబంధించిన పలు సమగ్ర చర్యలు తీసుకోవలసిన కనీస బాధ్యత యాజమాన్యాల మీద ఉంది. కార్య క్షేత్రంలో పని చేస్తున్న సిబ్బంది సంపూర్ణ ఆరోగ్య, భద్రతలకు సంబంధించిన చర్యలు తీసుకోవడానికి 'నేషనల్ అక్యుపేషనల్ సేఫ్టీ అండ్ హెల్త్ సిస్టమ్'ను ఏర్పాటు చేసి కార్మిక, శ్రామిక, భద్రత, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన పలు మార్గనిర్దేశకాలు విడుదల చేస్తూ, పటిష్టంగా అమలు అయ్యేలా చూడాల్సిన కర్తవ్యం ప్రభుత్వ, యాజమాన్యాల మీద ఉన్నది. ఉద్యోగ శ్రామిక వర్గాలు అంకితభావంతో పని చేస్తేనే దేశ ఆర్థిక ప్రగతి రథం సక్రమంగా సాగుతుంది. విపత్కర పరిస్థితుల్లో అత్యవసర సేవలు, పారిశ్రామిక ప్రగతి కొనసాగేలా చూశారు. కరోనా అకాలంలో ఆరోగ్య పరిరక్షణ యజ్ఞంలో ప్రాణాలొడ్డి అమూల్య సేవలు అందిస్తున్న ఫ్రంట్ లైన్ వారియర్లను కాపాడుకోవలసిన కనీస బాధ్యత ప్రభుత్వాలతో పాటు మనందరి మీద ఉందని గుర్తించాం.

శ్రామిక వర్గాల ఆత్మ స్థైర్యం కాపాడాలి:

మన అపార మానవ సంపదనుల విపత్తుల నుంచి కాపాడుకుంటూ, ఆర్థిక పురోగమనాన్ని కొనసాగించాలి. ముఖ్యంగా ఉద్యోగ, శ్రామిక, కార్షక, కార్మిక వర్గాల మానసిక స్థైర్యాన్ని కాపాడాల్సి ఉంది. ప్రమాదాలను పసిగడుతూ, సంక్షోభాలను సమర్థవంతంగా ఎదుర్కొనే శిక్షణలు తీసుకుంటూ, ఆరోగ్య భద్రతలను కాపాడే వ్యవస్థలను ప్రతి సంస్థ/కార్యాలయం/పరిశ్రమ/వ్యాపార/వర్తక వర్గాలు వెంటనే నెలకొల్పాలి. క్షేత్ర స్థాయిలో జరిగే ప్రమాదాలను నివారించడం, వృత్తి సంబంధ వ్యాధులను అరికట్టడం, గాయపడిన వారికి సత్వర చికిత్సలు అందించడం, భవిష్యత్తు భద్రతా చర్యలను చేపట్టడం గూర్చిన అవగాహన చేపట్టాలి.

శ్రామికుల శ్రేయస్సు ప్రధానం కావాలి:

28 ఏప్రిల్ రోజున విధుల్లో ప్రాణాలర్పించిన శ్రామిక సోదరులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించే వేదికగా 'ప్రపంచ కార్యక్షేత్రంలో భద్రత, ఆరోగ్య దినం–2024' ఉపయోగపడేలా కార్యక్రమాలను రూపొందించాలి. ఆధునిక శాస్త్రసాంకేతిక విప్లవం వల్ల ఉత్పన్నమైన నానో టెక్నాలజీ, బయోటెక్నాలజీ లాంటి ప్రక్రియలు క్షేత్రస్థాయిలో పలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. సిబ్బందిలో పెరిగిన పని భారం, ఉద్యోగాల్లో కోతతో పని ఒత్తిడి, పని క్షేత్రంలో శుచి శుభ్రత కొరవడడం లాంటి కారణాలతో ఆరోగ్యం గాల్లో దీపం అవుతున్నది. ఉద్యోగాలు, ఉపాధులు కోల్పోవడం/వేతనాల్లో కోతల వల్ల స్వయం ఉపాధులు/అవుట్ సోర్సింగ్/తాత్కాలిక కాంట్రాక్టులు పుట్టుకు రావడంతో క్షేత్రస్థాయి అనారోగ్యాలు/అభద్రతలు పెరిగాయి. రసాయన పరిశ్రమల్లో విధులు నిర్వహించే సిబ్బంది ఆరోగ్యం అతి ప్రమాదకరం అవుతున్నది. శ్రామికులే ప్రగతిరథ కందెనలని, శ్రామిక శక్తితోనే బహుముఖీన అభివృద్ధి సాధ్యపడుతుందని మరువరాదు.

విధి నిర్వహణలో ప్రమాదాలు, అకాల మరణాలు నివారించదగినవే. ప్రభుత్వాలు, స్వచ్ఛంధ సంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలు, కార్మిక సంఘాలు, సభ్య సమాజం చేయి చేయి కలిపి ఆరోగ్య భారతాన్ని, సంపూర్ణ భద్రత వలయాలను నిర్మిద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# అభివృద్ధి, పరిశోధన రెండూ ఆర్థిక వ్యవస్థకు, దేశానికి వెన్నెముక బలం లాంటివి - ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: ఆర్థిక వ్యవస్థ, దేశం రెండింటికీ వెన్నుముక బలంగా పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) కీలక పాత్ర పోషిస్తున్నాయని ఉపరాష్ట్రపతి శ్రీ జగదీప్ ధన్కడ్ అన్నారు. ఔషధ అభివృద్ధిలో ఆవిష్కరణల ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, ఆర్ అండ్ డి ప్రయత్నాలు కేవలం ఆవిష్కరణలు, వాటి ఆచరణలో పెట్టడమే కాకుండా, మానవాళికి అత్యున్నత సహకారాన్ని కలిగి ఉన్నాయని ఆయన చెప్పారు. "సైన్స్ మరియు పరిశోధనల ద్వారా మానవాళికి సేవ చేయాలనే మన ప్రయత్నాన్ని తాత్కాలిక వైఫల్యాలు అడ్డుకోకూడదు'' అని ఆయన సూచించారు.

వాక్సిన్ మైత్రి చొరవ ద్వారా కోవాక్సిన్ విరాళంతో సహా అంతర్జాతీయ టీకా ప్రయత్నాలకు భారతదేశ సహకరించడం, "వసుధైవ కుటుంబం" సూత్రానికి దేశ నిబద్ధత, దీర్ఘకాల సహకారాన్ని ప్రతిబింబిస్తుందని అయన ప్రముఖంగా ప్రస్తావించారు.

విఘాతం కలిగించే సాంకేతికతలపై దృష్టి సారించి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి పరిశోధన, అభివృద్ధికి మరిన్ని మార్గాలు వేసేందుకు కార్పొరేట్ దిగ్గజాలు ఆ సంస్థలకు చేయూత నివ్వాల్సిన అవసరాన్ని శ్రీ ధన్కడ్ మరింత స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లోని భారత్ బయోటెక్ ఫెసిలిటీలో జరిగిన కార్యక్రమంలో శ్రీ ధన్కడ్ ప్రసంగిస్తూ, ఇటీవలి కాలంలో పద్మ అవార్డుల విశ్వసనీయతను కొనియాడారు. పద్మ అవార్డులు ఇప్పుడు చాలా ప్రామాణికమైనవి, అర్హులైన వ్యక్తులకే చెందుతున్నాయని ఉపరాష్ట్రపతి నొక్కి చెప్పారు. " ఈ అవార్డులు ఇకపై ప్రాపకాలకు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ ద్వారా వచ్చే కీర్తి ద్వారా నడవవు" అని ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు.

ఆర్థిక సమస్యలను ప్రస్తావిస్తూ, అనవసరమైన దిగుమతుల వల్ల విదేశీ మారకద్రవ్యం గణనీయంగా తగ్గిపోతుందని శ్రీ ధన్కడ్ ప్రముఖంగా ప్రస్తావించారు. స్థానిక ఉత్పత్తులను, సామాజిక నిబద్ధతను ప్రోత్సహించే తత్వానికి ఈ పద్ధతి విరుద్ధమని విమర్శిస్తూ, మూడు తీవ్రమైన పరిణామాల గురించి ప్రజలను అయన హెచ్చరించారు: విదేశీ మారక నిల్వలను నివారించడం, స్థానికంగా లభించే వస్తువులను దిగుమతి చేసుకోవడం ద్వారా దేశీయ తయారీకి ఆటంకం, ఇంకా, వ్యవస్థాపక అవకాశాలను అణిచివేయడం పై దృష్టి సారించాలన్నారు.

ప్రపంచంలోని అనేక అగ్రశ్రేణి సంస్థలు తమ విస్తృతమైన పూర్వ విద్యార్థుల నుండి తమ బలాన్ని ఇంకా పెంచుకుంటున్నాయని ఆయన అన్నారు. పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని, థింక్ ట్యాంక్‌ల ద్వారా బలమైన పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌నుఏర్పరచుకోవాలని ఉపరాష్ట్రపతి సూచించారు. దేశ వృద్ధి, అభివృద్ధికి దోహదపడాలని కోరారు.

విఘాతం కలిగించే సాంకేతిక పరిజ్ఞానాల వాహకీకరణ కోసం మాట్లాడుతూ, వారి పరివర్తన సామర్థ్యాన్ని ఉపరాష్ట్రపతి నొక్కిచెప్పారు, వారి నియంత్రణ లేని విస్తరణ విషయంలో కూడా ఆయన హెచ్చరించారు.

బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ పరిశోధనలపై భారతదేశం అచంచలమైన అంకితభావం కారణంగా ప్రపంచ ఫార్మసీ కేంద్రంగా దాని ఖ్యాతిని పెంపొందించడానికి దారితీసిందని ఆయన పేర్కొన్నారు.

వేగవంతమైన పురోగతి, చురుకైన ముందడుగు కారణంగా భారత్ ఆరోహణ క్రమం, ఒక సూపర్ పవర్‌గా ఉందని ఉపరాష్ట్రపతి అన్నారు. భారత్ భవిష్యత్తుపై ఆయన విశ్వాసం వ్యక్తం చేస్తూ, నిద్రాణ స్థితి నుండి వేగవంతంగా కదిలే శక్తిగా పరివర్తన చెందడాన్ని ఉపరాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు.

## మార్చి 30న ఇచ్చిన ఆదేశాలు పాటించాలన్న ఎన్నికల సంఘం

అమరావతి, ఏప్రిల్ 27: పింఛన్ల పంపిణీపై ఏపీ ప్రభుత్వానికి ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల కోడ్ అమలు దృష్ట్యా లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరింది.

పింఛన్ సహా నగదు బదిలీ పథకాలకు అనుసరించాల్సిన మార్గదర్శకాలను మార్చి 30న జారీ చేసినట్లు వెల్లడించింది. ఆ మార్గదర్శకాలను వాస్తవిక దృష్టితో ఆలోచించి అమలు చేయాలని సీఎస్ జవహర్‌రెడ్డికి తేల్చిచెప్పింది. పంపిణీకి శాశ్వత ఉద్యోగులను వినియోగించుకోవాలని స్పష్టం చేసింది. పింఛన్ల ఇంటింటి పంపిణీకి వాలంటీర్లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకోవాలని ఈసీ ఆదేశించింది.

పింఛన్ల అందజేతలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై చాలా ఫిర్యాదులు వచ్చాయని ఈసీ పేర్కొంది. లబ్ధిదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురైనట్లుగా తమ దృష్టికి వచ్చిందని తెలిపింది.

## శాలువతో ఎమ్మెల్యే ముఠా గోపాల్ గారిని సన్మానించిన ఉపాధ్యక్షుడు ఎస్ టి ప్రేమ్



హైదరాబాద్, ఏప్రిల్ 27: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముషీరాబాద్ ఎమ్మెల్యే శ్రీ ముఠా గోపాల్ గారు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ గాంధీనగర్ డివిజన్లో బిఆర్ఎస్ జెండా ఎగురవేశారు ఈ కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముఠా పద్మ నరేష్ గారు, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్ కుమార్ గారు ముఠా నరేష్ గారు ముచ్చ కుర్తి ప్రభాకర్ గారు మొదలగు వారు పాల్గొన్నారు

# క్రొత్త మరియు తాజాగా తెర మీదకు వస్తున్న నవీకరణ యోగ్య శక్తి సంబంధించి సాంకేతికతల కోసం వినూత్నమైన ఆర్థిక సహాయ సాధనాల అవసరం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: నెదర్‌లాండ్స్ లోని రాటర్ డేమ్ లో జరిగిన వరల్డ్ ఎనర్జీ కాంగ్రెస్ యొక్క 26 వ సంచిక లో భాగం గా "ద న్యూ ఇంటర్ డిపెండెన్సీస్: ట్రస్ట్, సెక్యూరిటీ ఎండ్ క్లయిమేట్ రెజిలియన్స్" అనే ఇతివృత్తం పై ఏర్పాటైన బృంద చర్చ లో ఇండియన్ రిన్యూవబుల్ ఇండియన్ రిన్యూవబుల్ ఎనర్జి డివెలప్ మెంట్ ఏజెన్సి లిమిటెడ్ (ఐఆర్ఇడిఎ.. 'ఇరెడా') యొక్క చెయర్ పర్సన్ ఒ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎమ్ డి) శ్రీ ప్రదీప్ కుమార్ దాన్ పాలుపంచుకొన్నారు.

చర్చ సాగిన క్రమం లో, శక్తి సంబంధి పరివర్తన బాట లో భారతదేశం సాగిస్తున్న యాత్ర ను గురించి మరియు దేశం లో నవీకరణ యోగ్య శక్తి స్వీకార ప్రక్రియ ను ముందుకు తీసుకుపోవడం లో ఐఆర్ఇడిఎ పోషిస్తున్న కీలక భూమిక ను గురించిన అంశాల ను ఇరెడా సిఎమ్ డి వివరించారు. 2030 వ సంవత్సరాని కల్లా 500 గీగా వాట్ (జిడబ్ల్యు) సామర్థ్యం కలిగిన శిలాజేతర ఇంధన సంబంధి శక్తి సామర్థ్యాన్ని సాధించాలి అని భారతదేశం పెట్టుకొన్న మహత్వాకాంక్ష భరిత లక్ష్యం జలవాయు పరివర్తన కు వ్యతిరేకం గా ప్రపంచం జరుపుతున్న పోరాటం లో ఒక ఆశాభరితమైన దీప స్తంభం గా భారతదేశాన్ని నిలబెడుతోంది అని ఆయన అన్నారు. అలాగే 2070 వ సంవత్సరాని కల్లా ఉద్గారాల పరం గా చూసినప్పుడు నికరం గా శూన్యం (సున్నా) లక్ష్యాన్ని చేరుకోవాలి అన్నది భారతదేశం యొక్క వచనబద్ధత గా ఉందన్న విషయాన్ని కూడా ఆయన ప్రముఖం గా ప్రకటించారు. నవీకరణ యోగ్య శక్తి రంగం లో శరవేగం గా పురోగమిస్తూ ఉన్న కారణం గా, ప్రపంచం లో నవీకరణ యోగ్య శక్తి ఉత్పాదన పరమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్న దేశాల జాబితా లో నాలుగో స్థానం లో భారతదేశం ఉంది అని ఆయన తెలిపారు.

పర్యావరణాని కి మైత్రీపూర్వకం గా ఉండే శక్తి ఉత్పాదన రంగ సంస్థల కు ఆర్థిక సహాయాన్ని అందించడం లో అతి పెద్ద బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బిఎఫ్‌సి) గా ఐఆర్ఇడిఎ చాలా కీలకమైనటువంటి పాత్ర ను పోషిస్తూ, శక్తి సంబంధి పరివర్తన గతి ని వేగవంతం చేస్తోంది అని ఆయన అన్నారు.

నవీకరణ యోగ్య శక్తి ఉత్పాదన రంగం లో నష్ట భయాల ను తగ్గించడం కోసం వినూత్నమైనటువంటి ఆర్థిక సహాయ పథకాల ను అమలు పరచడం ద్వారా మరియు ఈ రంగం లో ప్రైవేటు రంగ సంస్థ ల ప్రమేయాన్ని ప్రోత్సహించడం ద్వారా శక్తి పరివర్తన ప్రధానమైన ప్రాజెక్టుల కు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడం లో ఐఆర్ఇడిఎ చేస్తున్న ప్రయాసల ను సిఎమ్‌డి ఈ సందర్భం లో వివరించారు.

ప్రపంచ వ్యాప్తం గా శక్తి రంగం లో తల ఎత్తిన సంకట స్థితి ని గురించి కూడాను వరల్డ్ ఎనర్జీ కాంగ్రెస్ యొక్క బృందం చర్చించింది. శక్తి ఉత్పాదన రంగం లో భద్రత కు పూచీ పడడం కోసమని విభిన్నమైనటువంటి మార్గాల ను అనుసరించడాని కి మరియు సుదృఢమైన మౌలిక సదుపాయాల ను కల్పించడానికి ప్రాముఖ్యాన్ని ఇవ్వవలసి ఉంటుంది అని సిఎమ్ డి స్పష్టం చేశారు. బలమైనటువంటి పవర్ నెట్ వర్క్ లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రాంతీయ మార్కెట్టుల ను ఏకీకరించడం ఎంతైనా ముఖ్యం అని ఆయన అన్నారు. దేశీయ పింఛను / బీమా నిధుల అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ (ఎయుఎమ్) నుండి 4 శాతం గాని లేదా 5 శాతం గాని నవీకరణ యోగ్య శక్తి బాండ్ ల కు కేటాయించడాన్ని తప్పనిసరి చేయాలని, ఇలా చేస్తే బాండ్ బజారు విస్తృతం అవుతుంది; అంతేకాక ప్రపంచ మరియు స్థానిక పెట్టుబడులు అదనం గా అంది వస్తాయి అని కూడా ఆయన ప్రతిపాదించారు.

పర్యావరణ అనుకూల ఆర్థిక వ్యవస్థ కు దోహదం చేయడం అనేది ఐఆర్ఇడిఎ యొక్క నిరంతర వాగ్దానం గా ఉంటుందని సిఎమ్‌డి పునరుద్ఘాటిస్తూ, తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కంపెనీ పెట్టుబడుల ను ఆకర్షించడం, నూతన సాంకేతికతల ను ప్రోత్సహించడం లతో పాటుగా విధానపరమైన సంస్కరణల కు మొగ్గ చూపుతున్నదని ఆయన అన్నారు. 2070 వ సంవత్సరాని కల్లా ఉద్గారాల పరం గా నికరం గా శూన్యం (సున్నా) స్థాయి ని సాధించే దిశ లో భారత దేశం పురోగమిస్తూ ఉన్న క్రమం లో, ఐఆర్ఇడిఎ దీర్ఘకాలికమైనటువంటి మరియు భద్రమైనటువంటి శక్తి ఉత్పాదన అవకాశాల కు మార్గదర్శకత్వాన్ని అందించడం లో అగ్రస్థానాన ఉంటుంది అని సిఎమ్‌డి అన్నారు.

"ద న్యూ ఇంటర్ డిపెండెన్సీస్: ట్రస్ట్, సెక్యూరిటీ ఎండ్ క్లయిమేట్ రెజిలియన్స్" అనే ఇతివృత్తం పై 2024 ఏప్రిల్ 24 న ఏర్పాటైన బృంద చర్చ లో పాలుపంచుకొన్న ఇతరుల లో సీనియర్ వైస్ ప్రెసిడెంట్, యూరోప్ మరియు హెడ్ ఆఫ్ కంట్రీ, యుకె, బిపి, లుయీస్ కింగ్ హమ్ సిబిఇ; గ్లోబల్ ఎనర్జీ ఒ రిసోర్సెస్ స్ట్రేటిజీ లీడర్, ఇవై, శ్రీ ఎండీ బ్రోగన్; మరియు పనామా కెనాల్ ఆథారిటి అడ్ మినిస్ ట్రేటర్ శ్రీ రికువార్టె వాస్కేజ్ మొరాలేస్ లు ఉన్నారు.


ఆహ్వానం
ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం
గుంటూరు జిల్లా రచయితల సంఘం
సంయుక్త ఆధ్వర్యంలో



సోమేపల్లి వెంకట సుబ్బయ్య జయంతి వేడుకలు
కవిసమ్మేళనం

తేది: 1 మే 2024 బుధవారం ఉదయం 10 గంటలకు
వేదిక: అన్నమయ్య గ్రంథాలయ ప్రాంగణం, శ్రీ వేంకటేశ్వర దేవస్థానం, బృందావన్ గార్డెన్స్, 5వ లైను, గుంటూరు

సభాధ్యక్షులు: డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి
ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం
ప్రధాన వక్తలు: శ్రీ తోటకూర వెంకటనారాయణ
ప్రముఖ సాహితీవేత్త
శ్రీ పొన్నూరు వేంకట శ్రీనివాసులు
అధ్యక్షులు, ప్రకాశంజిల్లా రచయితల సంఘం
గౌరవ అతిథి: శ్రీ చిటిపోతు మస్తానయ్య
అధ్యక్షులు, శ్రీ వేంకటేశ్వర దేవస్థాన కమిటి
కార్యక్రమ నిర్వహణ: శ్రీ ఎస్.ఎమ్.సుభాని
శ్రీ శర్మ సి.హెచ్
కార్యదర్శులు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

ఒక కవితో.. రెండు మాటలో.. మీరూ వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనండి.

| డా॥ సి. భవానీదేవి | బొమ్ము ఉమా | నానా | చలపాక ప్రకాష్ |
| --- | --- | --- | --- |
| అధ్యక్షులు | ఉపాధ్యక్షుడు | కోశాధికారి | ప్రధాన కార్యదర్శి |


# రాజధాని కూడా కట్టలేని నేతలకు ఓట్లు ఎందుకు వేయాలి- షర్మిల



అమరావతి, ఏప్రిల్ 27: రాజధాని కూడా కట్టలేని నేతలకు ఓట్లు ఎందుకు వేయాలని ఏపీ కాంగ్రెస్ ఛీఫ్ షర్మిల ప్రశ్నించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక జగన్ ప్రత్యేక హోదా కోసం ఒక్క ఉద్యమమైనా చేశారా? రాజధాని కట్టగలిగారా అని ప్రశ్నల వర్షం కురిపించారు.

చక్కెర పరిశ్రమలు మూతపడితే తెరిపించాలనే ఆలోచన పాలకులకు ఉందా అని నిలదీశారు. రైతులకు అన్యాయం జరుగుతుంటే సీఎం ఏం చేస్తున్నారు.. మెగా డీఎస్సీ అని దగా డీఎస్సీ ఇచ్చారు. ఎన్నికలకు 2 నెలల సమయం ఉందన్నప్పుడే గుర్తొచ్చిందా.. కుంభకర్ణుడు ఆరు నెలలే నిద్రపోతాడు. మీరు ఐదేళ్లు నిద్రపోయి ఎన్నికలప్పుడు లేచారా.. సిద్ధమంటూ బయల్దేరారు.. దేనికి అప్పులు చేయడానికా.. మద్యపాన నిషేధం చేయకపోతే ఓట్లే అడగనన్నారు. ఇప్పుడు సర్కారే లిక్కర్ అమ్ముతోంది. నాసిరకం మద్యం తాగి ప్రజలు చనిపోతున్నారు" అని షర్మిల మండిపడ్డారు.

# ఓటు వేయడం దేశ పౌరుడి బాధ్యత- సీఈవో ముఖేష్




అమరావతి, ఏప్రిల్ 27: ఓటు వేయడం, మన హక్కు మాత్రమే కాదు, భారత దేశ పౌరుడిగా మన భాధ్యత అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఇవాళ గుంటూరులో ఓటర్ అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొననున్నారు. ఎన్టీఆర్ స్టేడియం నుండి త్రీ కే వాక్ ను ప్రారంభించారు. అనంతరం మొదటి సారి ఓటు వేస్తున్న యువతకు ఓటు హక్కు పై అవగాహన కల్పించారు.

మొదటి సారి ఓటు వేయనున్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు.. . ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టి చేయడానికి ప్రతి ఒక్కరూ ఓటు వేయడం అనే భాధ్యత తీసుకోవాలని సూచించారు. మీరు ఓటు అనే పండుగలో మీ హక్కు వినియోగించుకోవడం కోసం, ఎన్నికల కమిషన్ విస్తృత ఏర్పాట్లు చేసిందని తెలిపారు.. మీరు ఓటు వేయండి.. ప్రతి ఒక్కరితో ఓటు వేయించండి అని సూచించారు ముఖేష్ కుమార్ మీనా.

ఇక, గ్రామీణ ప్రాంతాలతో పోల్చుకుంటే, కొన్ని అర్బన్ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉందన్నారు ముఖేష్ కుమార్ మీనా.. విద్యార్థులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఎగువ మధ్యతరగతి ప్రజలు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారాని గుర్తించాం.. వారిని పోలింగ్ బూత్‌కు తీసుకొచ్చే విధంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు.. అయితే, ఈ ఎన్నికల్లో 83 శాతం ఓటింగ్ పర్సంటేజ్ లక్ష్యం తో పనిచేస్తున్నాం అని వెల్లడించారు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా. కాగా, ఇప్పటికే రాష్ట్రంలో నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాగా.. మే 13వ తేదీన పోలింగ్ జరగనుంది.. దీనికి ఎన్నికల కమిషన్ పూర్తిస్థాయి ఏర్పాట్లలో మునిగిపోయింది.

